# హనుమానందం
# (దృశ్య నాటకం)

- ఆచార్య వి.యల్.యస్. భీమశంకరం

## ప్రేరణ:

సుమారు రెండు సంవత్సరాల క్రితం, పద్యాన్ని ఎలా తిరిగి ప్రాచుర్యంలోకి తేవాలన్న విషయంపై ఆంధ్రభూమి దినపత్రిక సంపాదకులు, శ్రీ యమ్.వి.ఆర్.శాస్త్రిగారి అధ్యక్షతన మా ఇంట్లో ఒక చిన్న సమావేశం జరిగింది. అనేకమంది కవి, పండితులు తమ సూచనలనిచ్చారు. ఆనాడు వచ్చిన సూచనలలో, ఒకటి:

మహాకవులు తిరుపతి వేంకట కవులు, మొదలైనవారు వ్రాసిన ఆనాటి పద్యాలు, ఈ నాడు పామరులుగూడా చదువుతున్నారు కదా, దీనికి కారణమేమిటి? అని ఆలోచిస్తే, బహుశః వారి పద్యాల గొప్పతనంతోబాటు, వారు వాటిని చక్కటి నాటకాలలో పొదిగారనేది ఒకటి అని సభ్యులు తలచారు. అందువల్ల, మనంగూడా కొన్ని దృశ్యనాటకాలు, వీలైతే హాస్య సంభరితమైనవి వ్రాసి, వాటిలో పూర్వ, ప్రస్తుత కవుల పద్యాలు, క్లిష్టం కానివి జతకూర్చి, వాటిని టెలివిజన్ వంటి ప్రసారమాధ్యమాలలో ప్రదర్శింప జేస్తే, పత్రికలలో ప్రచురింపజేస్తే, ప్రజలు వాటిని చూచి, చదివి, పద్యాలనుగూడా మననం చేసుకుంటారని అభిప్రాయం వ్యక్తంచేశారు.

అప్పుడు, ఆ సభ వారు, నన్ను అటువంటి నాటకం వ్రాయుడని కోరారు. ఆ నిర్ణయం ప్రకారమే నేను ఈ ''హనుమానందం'' వ్రాశాను.

## నాంది

తెర తీయగానే సభావేదిక. దానిపై ఒక బల్ల, మూడు కుర్చీలు. వాటిలో ముగ్గురు వ్యక్తులు కూర్చుని ఉంటారు. బల్లమీద పువ్వులతో ఒక వేజ్, 3 పుష్పగుచ్ఛాలు, 3 మినరల్ వాటరు సీసాలు, ఒక హ్యాండ్ మైక్రోఫోన్. ప్రక్కన స్టీలు స్టాండ్ పై ఇంకొక మైక్రోఫోను. వెనుక గోడకు ఆనుకొని తెరమీద ఒక పెద్ద ఎలక్ట్రానిక్ క్లాక్ కం క్యాలెండర్ వుంటుంది. దానిలో టైముతోబాటు పెద్ద అంకెలలో తేదీ గూడా కనబడుతుంటుంది.

www.sirimalle.com

ముగ్గురిలో మధ్యనున్నాయన సభాధ్యక్షుడు. ఆయనలేచి నిలబడి, హ్యాండ్ మైక్ చేతిలోకి తీసుకుని దానితో మాట్లాడటం మొదలు పెడతాడు. ఆయన మాటలు సభలో అందరికీ బాగానే వినిపిస్తాయి.

**స.అ:** సోదర, సోదరీమణులారా!...

అనగానే లౌడ్ స్పీకర్ లోంచి బయ్యిమని శబ్దం ఆగకుండా వస్తూ వుంటుంది. కొంతసేపు అటూ, ఇటూ చూసి, అధ్యక్షుల వారు మాట్లాడుతూనే వుంటారు. దానికి సంకేతంగా, ఆయన పెదాలు కదులుతూనే వుంటాయి. కానీ బయ్యిమని శబ్దం తప్ప మరేమీ వినబడదు. కొంత సమయం అలా గడుస్తుంది. సభలోని జనులు అసహనంగా ఒకరి మొగాలు ఒకరు చూచుకుంటూ, అటు ఇటు కదులుతూ వుంటారు. ఒకరిద్దరు మైక్ తగ్గించండి, అని అరుస్తారు. కానీ అది లౌడ్ స్పీకర్ శబ్దంలో మునిగి వినబడదు.  తరువాత, అధ్యక్షుల నోటినుండి లౌడ్ స్పీకర్లో (అది ఇప్పుడు బయ్ మనడం ఆగిపోయి) వినబడుతుంది,

**అధ్య:** ఇంతటి మహావక్త శ్రీ వాచాలరావుగారు మనకు ముఖ్య అతిథిగా రావడం మన పూర్వకృత పుణ్యం. వారిప్పుడు ఉపన్యసిస్తారు.

ముఖ్య అతిథి లేచి రెండడుగులు ప్రక్కకు వేసి, సభకు నమస్కారంచేసి, నిలిచి వున్న మైకులో నుంచి మాట్లాడటం మొదలు పెడతాడు.

**ము.అ:** సభకు నమస్కారం. నేడు చాలా సుదినం!

అని ఆయన మొదలుపెట్టగానే, లౌడ్ స్పీకర్ ఆగిపోతుంది. తదుపరి మాటలు వినబడవు. ఆయన మాత్రం కుడిచేయి ఎత్తుతూ, దించుతూ, సభ్యులకేసి చూపిస్తూ, ఎడమచేతిలో లౌడ్ స్పీకర్ స్టాండ్ పట్టుకొని, ఊగిపోతూ మాట్లాడుతూనే ఉంటాడు.

ఒకటి రెండు నిమిషాలకు హాల్లో లైట్లారిపోతాయి. వేదిక పైనున్న గడియారం, క్యాలెండర్ పైనున్న చిన్న బల్బు నుండి వచ్చే గుడ్డి వెలుతురు ద్వారా వేదిక మీద ఏంజరుగుతుందో సభలోవారికి కనిపిస్తూనే వుంటుంది. అ  వక్త ఇంకా మాట్లాడుతూనే ఉంటాడు. అంతలో గడియారంలో అలారం మ్రోగుతూ, దాని అంకెలు గిర్రున ముందుకు తిరుగుతాయి (సమయం మించిపోతున్నట్టు సూచిస్తూ). క్యాలెండరు లో ఒకరోజు ముందుకు జరిగినట్లు కనిపిస్తుంది. సభలో అందరూ అసహనం కోల్పోయి అరుపులు, చప్పట్లు, ఈలలతో గొడవ చేస్తారు. అంతలో ముఖ్య అతిథి, కొంత రొప్పుతూ, ఇలా అంటాడు. (అప్పటికి లైట్స్ వెలుగుతాయి. మాటలు మరల వినబడటం మొదలుపెడతాయి.)

www.sirimalle.com

**ము.అ:** మహాశయులారా! నేను మాట్లాడవలసిన విషయాలు చాలా వున్నాయి. కానీ ఇప్పటికే (అని వెనుకకు క్యాలెండర్ కేసి చూచి) కాలాతీతంయైందనుకుంటాను. కనుక ఇంక ముగిస్తాను. (సభలో ఈలలు, బల్లలపై చరుపులు). నేను చెప్పినదంతా మీరు శ్రద్ధగా విన్నందుకు ధన్యవాదాలు. నేను చెప్పిన వాటిలో ముఖ్యమైనవి కొన్నైనా మీకు మీ జీవితాలలో వుపయోగపడితే నా జన్మ సార్ధకమైనదనుకుంటాను.

అని ముగిస్తాడు. అప్పుడు వేదికపైనున్న మూడవ వ్యక్తి లేచి వుపన్యసించడానికి ఉద్యుక్తుడౌతాడు. అది చూడగానే, సభలో అల్లరులు ఎక్కువై వేదిక పైకి చెప్పులు విసరడం జరుగుతుంది. వేదికమీది వారు హడావిడిగా వేదిక వెనుకకు పరుగెడతారు. తెరను లాగేసి మూసేస్తారు. రణగొణధ్వనులమధ్య, తదుపరి నాటకం జరుగుతుంది.

## ప్రస్తావన:

మూసివున్న తెర వెనుక స్టేజి మీదకు బూట్ల చప్పుడు చేసుకుంటూ ప్రొడ్యూసరు (నిర్మాత) మూటలరావు, డైరెక్టరు (దర్శకుడు) దర్శకరావు, వాని అసిస్టెంట్ వస్తారు.

(ఆ హడావిడిలో మైక్ ఆఫ్ చేయడం మరిచిపోతారు కనుక, సభాసదులకు మూసిన తెరలోని సంభాషణలు వినిపిస్తూనే వుంటాయి)

**ప్రొడ్యూసర్:** ఏమయ్యా డైరెక్టరూ, ఎంత రసాభాస చేశావయ్యా?

**డైరెక్టరు:** నేనేం జేసానండి బాబు. మంచి అధ్యక్షుడిని, వక్తలను కష్టపడి బతిమాలి తీసుకొని వచ్చా. నా ముఖం చూచి వచ్చారు వాళ్ళు. ఆషామాషీ డైరెక్టర్లు పిలిస్తే రారు, తెలుసాండీ. ఆ లౌడ్ స్పీకర్లే చెత్తవి.

***ఇంతటి వక్తలన్ పిలిచి ఈ సభ నేర్పడ చేసినాడ, యూ***
***రంతయు పర్వులెత్తుచును హర్షముతోడను వచ్చియుండె; ముం***
***దింత టుదాత్తమైన సభ యేయెడ కానగరాదు, మీరె లోభులై***
***సంతలలోన నేరికొని చౌకగా తెచ్చిరి జంకు మైకులన్.***

వాటివల్లే సభ ఇలా పాడైంది.

www.sirimalle.com

*చంద్రయానమందు జయము సాధించిన*
*భారతదేశ శాస్త్ర పండితులకు*
*ఆగిపోక సరిగా పనిచేయు మైకుల,*
*సృజన చేయు చేవ యేల లేదో?*
*ఏమయ్యా ఆదర్శకా!*

**ప్రొ:** వాడెవడు?

**డై:** ఇతనే నా అసిస్టెంటండి. నేను దర్శకుణ్ణి కదా అందుకే వీడిని ఆదర్శకా అంటున్నా నన్న మాట. అదన్న మాట. అంటే అసిస్టెంటు దర్శకా అన్న మాట.

**అసిస్టెంటు:** నమస్కారం ప్రొడ్యూసర్ గారూ, ఆ వచ్చిన వక్తైనా స్పీకర్లు పనిచేయడం లేదని తెలిసి, ప్రసంగాల నాపెయ్య వలసింది, లేదా కుదించవలసింది. అట్టే మైక్ పట్టుకుంటే అంతే.

*మైకు చేత బట్ట మైమర్చి తనువెల్ల,*
*పూనకంబు పూని పులకరించి,*
*'డేటు' మారు దనుక మాటాడ మానరు,*
*ఎట్టి వాసను వోసె నేమొ తల్లి!*

**ప్రొ:** అయ్యా అయిపోయింది. అంతా అయిపోయింది. నా కొంప మునిగి పోతోంది. ఇప్పుడైనా నాటకం మొదలు పెట్టండి.

**డై:** సరే, మన యాంకర్లంతా వచ్చారా? అలా వెర్రి మొగం వేసుకుచూస్తావేం. అందరినీ టైముకు తీసుకొచ్చే బాధ్యత నీదేనని చెప్పానా. నిన్నే, ఆదర్శకా!

**అ.ద:** అసలు నన్నడిగితే, ఇలా గంటల కొలది, -- కాదు, కాదు, కాలండరులో తేదీలు మారేదాకా మైకు పట్టుకుని వినేవారిని వాయించేవారిని శిక్షించాలిసిందే. మహానుభావుడు కీ.శే. నండూరి రామకృష్ణమాచార్యుల వారు చెప్పినట్లు,
*అరసి వెయ దగును – అపరాధ సుంకమ్ము,*
*పావుగంట దాటు వక్తపైన,*

www.sirimalle.com

*ధనము నపహరించు మనుజుడే దొంగయా?*

*కానరాని దొంగ – కాలహర్త.*

**ప్రొ:** ఇంకాపండి. ఇప్పటికే ఆలస్యం అయింది. మనం తక్షణం మొదలెట్టకపోతే ఇక నాటకమాడే పనిలేకుండా మన పని పడతారు ప్రేక్షకులు.

**ద:** అడిగినదానికి బదులు చెప్పరా, ఆదర్శకా. నటులు, టెక్నీషియన్లు అందరూ వచ్చారా, స్టేజికి కావలిసిన వస్తువులన్నీ తెచ్చావా?

**ఆ.ద:** అందరూ వచ్చారండి. నిజానికి కావలిసిన నటులకంటే ఎక్కువగా నటులు వచ్చారండి.

**ద:** నటులు ఎక్కువగా రావడమేమిటి నీ బొంద.

**ఆ. ద:** అలా విసుక్కోకండి, సార్. మీరు మన నాటకానికి మనిషంత ఎత్తు హనుమంతుని బొమ్మ తెమ్మన్నారు కదా! అంత పెద్దబొమ్మ ఊళ్ళో ఎక్కడ దొరకలేదండీ. అందుకని, మూతికి వేరే ఎత్తు పెట్ట నక్కరలేకుండా, పళ్ళెత్తుగా వుండే మనిషిని తెచ్చానండి.

**ద:** కొంపముంచావు. కదలకుండా వుండే బొమ్మ కావాలిగానీ, మనిషెందుకురా. వాడు కదిలిపోడూ.

**ఆ.ద:** మీరేమి దిగులుపడకండి. వీడు కదిలే మనిషి కాదు. అంత పెద్ద శరీరం మనం ఎక్కడ కూర్చోపెడితే అక్కడే ఉంటాడు.

*పెద్ద కడుపువాడు, యెద్దు దేహము వాడు,*
*చిన్న బానాను బోలు శిరమువాడు,*
*ఎనుబోతు కేనయైన తను ఛాయ గలవాడు,*
*చేటతో సమమైన చెవులవాడు,*
*చింతాకు సరియైన చిన్న కన్నులవాడు,*
*కోతి యట్లుగ ఎత్తు మూతి వాడు,*
*అడుగు వేయుటనిన ఆయాస పడువాడు,*
*కూర్చుండి నిద్రతో కునుకువాడు,*
*సరిగ గోరిల్ల కీడైన సొరువాడు,*

www.sirimalle.com

***పట్న మంతయు గాలించి పది దినములు,***
***వెదకి తెచ్చితి నెంతయో వేసరిల్లి,***
***మీరు సంతోషమున నన్ను మెచ్చెదరని.***

వాణ్ని చూస్తే అడిదం సూరకవి అనే కవీంద్రుడు బాచన్న అనేవాని పైన చెప్పిన పద్యం గుర్తొస్తుంది. వీడూ బాచన్న లాగే ఉంటాడు.

***బాచా! బూచులలోపల***
***బాచన్నే పెద్దబూచి పళ్ళున్ దానున్,***
***బూచన్న రాత్రి వెఱతురు,***
***బాచన్నను చూచి పట్టపగలే వెఱతుర్.***

ద: సర్లే వాడసలు కదలకుండా కూచునేట్లు చూడు.

ప్రొ: ఏమయ్యా దర్శకా! మన నాటకంలో హనుమంతుడు వేషానికి మంచి నటుడు కావాలి గాని బొమ్మెందుకయ్యా. ఇంతకీ నాటకం హనుమద్విజయమేనా?

ద: మీరిలా ఆఖరిక్షణంలో నాటకం పేరుమార్చి నన్ను అప్రతిష్ఠ పాలు చేయ చూస్తున్నారా? ఫోన్లో మీరు స్పష్టంగా హనుమానందం అన్న నాటకం వేయమన్నారు. నేను వూళ్ళో వుండను. నాటకం నాటికి వస్తాను. అన్నీ నువ్వే చూచుకోమన్నారు. ఈ హనుమానందం నాటకం పేరైనా నేనెన్నడూ వినలేదు. ఏం చేయాలో తోచక నేనెరిగిన ప్రముఖ కవిగారి వద్దకు వెళ్లి నాగోడు వెళ్లబోసుకున్నా. ఆయనకూడా హనుమానందం పేరు వినలేదట. అటువంటి నాటకం వుంటుందా అన్నారు. కాని, నా బాధ చూడలేక వారు,

**అప్పటి కప్పుడు వారలు,**
**ఒప్పగు కథనల్లి వ్రాసి రొక నాటకమున్**
**చెప్పద్దూ విన ముద్దౌ**
**గొప్ప చమత్కార హాస్య గుంఫన యుతమున్.**

క్రొత్తగా వ్రాసి ఇచ్చారు. అమ్మయ్య బ్రతికించారనుకున్నాను. వ్రాసినందుకు పారితోషకం ఇవ్వబోయాను. ఆయనేమో నాకు ఏ పారితోషకమూ వద్దు. ఇది నీకోసం వ్రాశాను. నేను వ్రాసినట్లు నువ్వు ఎవరితోనూ,

www.sirimalle.com

ముఖ్యంగా నాటకం చూడ్డానికి వచ్చిన వారితో చెప్పకు. నా తాట నిలువునా ఒలవగలరు. ఎందుకైనా మంచిది ఏ తేదీన నాటకం ఆడుతున్నారో చెప్పు, నేను పై వూరు వెళ్ళిపోతానన్నారు.

**ప్రొ**: కొంపముంచావు

**ద**: మీరేమి బెంగ పడకండి. క్రెడిట్ అంతా మీకే. మీరే ఈ నాటకానికి కథ, స్క్రీన్ ప్లే వ్రాశారని బహుళ ప్రచారం చేయించాను. అక్షరగంధంలేని మూటలరావు గారు వ్రాశారంటే చూద్దామని జనులు తండోపతండాలుగా వచ్చారు.

**ప్రొ**: ఓరి నాయనో చంపావురా నన్ను. నా మీద ఇంతకోపం ఎందుకురా నీకు? పొరబాటున నేను ఈ రోజే తిరిగి వచ్చాను. ఈ సంగతి తెలుస్తే నేనూ జాగ్రత్తపడేవాడిని.

**అ.ద**: మరలాంటప్పుడు ఈ ఉపన్యాస కార్యక్రమం ఎందుకు పెట్టించారు గురువుగారూ.

**ద**: ఉండరా, నువ్వొకడివి. ఈ కవిగారు ఎంత కష్టపడినా నాటకం పేరుకు దగ్గంత పెద్దగా తయారుచేయలేకపోయారు. అందుకే టైం ఫిల్ కోసం ఉపన్యాసం పెట్టించా. ఇంకా వృథా కాలక్షేపం మాట్లాపు. నటులందరికీ మేకప్ వేయించావా?

**అ.ద**: ఆవన్నీ అయిపోయాయండి. ఒక్క హనుమ మూతికే ఎర్ర రంగు రెండు డబ్బాలు తెచ్చినా సరిపోలేదు. ఇప్పుడు మూడోది తెచ్చి వేస్తున్నారులెండి.

**ద**: పర్లేదు వాడు నాటకం చివరగాని స్టేజిపై ఉండడు.

**అ.ద**: మరొక చిన్న చిక్కొచ్చిందండి. హనుమ ఏమైనా సరే నేను తోక పెట్టుకోనని గొడవ చేస్తున్నాడండీ. ఇతనిది కూర్చునే పాత్ర కనుక, సరే నన్నానండి.

(ఇంతలో సభలో కలకలం చెలరేగి, అరుపులు వినబడ్డాయి. మీరు నాటకం మొదలుపెడతారా, లేక మమ్మల్ని లంకా దహనం చేయమంటారా, అంతే, స్టేజి మీద వారు లోపలి పరుగు పట్టి క్షణాలమీద స్టేజి సిద్ధం చేసి తెరలాగారు)

www.sirimalle.com

# మొదటి రంగం

స్టేజి పై ఉన్నతంగా ఒక సింహాసనం. దానికిరుప్రక్కలా ఇద్దరు ముసలి సైనికులు ఈదురో అనునట్లు నిలబడివుంటారు. క్రింద రెండు వైపులా వరుసగా ఆసనాలు; వాటిపై ఆసీనులైన రాచ పరివారం. మధ్య కొద్దిపాటి ఎత్తుగల బల్లపై రెండు కంబళులు. వానిపై ఇద్దరు పండిత వేషగాళ్ళు ఇటు, అటు ఒకరికొకరు ఎదురు మదురుగా కూర్చొనివుంటారు. అందులో ఒకాయనకు ఒకే కన్ను, జుట్టు మాత్రం బారెడు. శరీరంపైన కూడా ఒత్తుగా వెంట్రుకలు. వారే మార్జాలరావు గారు. ఆ రాజుగారి ఆస్థాన విద్వాంసుడు.

తెర లేవగానే, వందిమాగధుల "బహుపరాకు" శబ్దాల మధ్య పరమ శివ వాహ మహారాజు గారు ప్రవేశిస్తారు.

**వందులు:**

**రాజ రాజ రమ్ము రాజన్య సభచేయ,**

**జనులు వచ్చిరి నిను వినగ స్వామి!**

**చేరి యెక్కు మయ్య సింహాసనంబును,**

**పరమశివుని వాహ! బహుపరాకు!**

**రాజు (సింహాసనం మీద కూర్చుని):** ఈ యాల నాకు చానా సంతోసంగ వుంది. మన ఆస్థాన ఇద్వాంసులుగోరు, మన మార్జాలరావు గోరితో పోటీకి దూరంనుండి ఒక ఏదాంతి గారొచ్చిండు. ఆయన పేరేదో చెప్పిండు. మరచా. పంతులూ నీ పేరేంది?

**పరదేశి పండితుడు:** నన్ను పుండరీక శాస్త్రి అంటారు, మహారాజ.

**రాజు:** అద్గదీ. పుండాకోరు శాత్రి. ఈరు, మన మార్జాల రావు పండితులవోరు వాదించుకుంటరు, మనం ఇని ఆనందిస్తం. మరెందుకాలస్యం. మొదలుపెట్టండి అయ్యవార్లు.

**పుం:** ముందుగా సరస్వతీదేవి స్తుతి చేస్తున్నాను.

**వాణీ! అలికుల సముదయ**

**వేణీ! అక్షర తరంగ వేల్లిత వీణా**

**పాణీ! ద్రుహిణుని రాణీ!**

**రానీ, నాపైన కరుణ రమ్య శ్రోణీ!**

www.sirimalle.com

(సభలో ఎవ్వరూ చప్పట్లు కొట్టరు)

ఇపుడు విఘ్ననాయక స్తుతి.

**అంకముచేరి శైలతనయాస్తన దుగ్ధములానువేళ, బా**

**ల్యాంక విచేష్ట తొండమున నావలి చన్ గబళింపబోవ ఆ**

**వంక కుచంబుగాన కహివల్లభహారముగాంచి వే మృణా**

**లాంకుర శంక నుండెడు గజాస్యుని గొల్తు నభీష్ట సిద్ధికిన్.**

వినాయకుడు అమ్మవారి ఒడిలో కూర్చుని ఆమె వామభాగమున ఉన్న స్తనమునుండి పాలు త్రాగుతున్నాడు. ఆమెకు రెండవ స్తనము లేదు. ఆ స్థానంలో పాముంది.

**మా:** అమంగళము నశించుగాక. ఇది అశ్లీలముల పుట్ట. బూతు పద్యమువలె తోచుచున్నది. అమ్మవారి కుచమునుండి గణపతి పాలు తాగుటా. ఏనుగు మొగముతో చను పాలుతాగుట అసంభవం. ఆమెకు ఒక కుచమే వున్నదా. హర హరా. అటుపక్కను పామా. ఏమిటయ్యా పుండరీకా ఇది. మహారాజు సమక్షమున ఇట్టి పద్యములు రచించి పాడవచ్చునా?

**రాజు:** అవును పంతులూ! నాకు ఇట్లాంటి పాడు పాటలిష్టముండవ్.

**పుం:** అయ్యా! ఇది నేను వ్రాసిన పద్యం కాదు. శ్రీ కృష్ణదేవరాయలవారి ఆస్థానంలోని ప్రముఖ కవి, కవితా పితామహుడు పెద్దన గారి మనుచరిత్ర ప్రబంధంలోనిది. తెలుగు సాహిత్యానికి మకుటాయ మానమై ప్రసిద్ధి గాంచినది. తెలుగువారికి గర్వకారణమై, అలంకారభూయిష్ఠమైన సుందర దృక్చిత్ర సూచకం. ఇందులో అశ్లీలమేమీ లేదు. ఆమాత్రం శృంగారం సాహిత్యానికి అందం చేకూరుస్తుంది.

**రాజు:** నాకదేదో తెల్దుగాని, మా పండితులవోరు తప్పంటే తప్పే. ఆ పెద్దనగోరికి చెప్పు నేను వొప్పుకోనని.

**పుం:** శిశువుగా నున్న వినాయకుడు తల్లివద్ద పాలుత్రాగడం బూతా? పైగా చమత్కారయుతంగా కవి, వినాయకుడు తల్లి పాలు త్రాగుతూ, అందరి చంటిపిల్లలవలె తన చేత్తో (తొండముతో) అమ్మ కుడిభాగం వెదుకుతూ వుంటే ఈశ్వరుడి ఆభరణమైన పాము దొరికిందని, అది విషజంతువని తెలియని అమాయక వయసు కలవానిగా చెప్పకనే చెపుతూ, పామును మెత్తని తామరతూడని భ్రమపడ్డాడని, భ్రాంతిమదలంకారాన్ని వాడారు. అలాగే తల్లి స్థానంలో అర్ధనారీశ్వరుని పెద్దన క్రొత్తవిధంగా సాక్షాత్కరింప చేశారు.

www.sirimalle.com

మహారాజా! మీరన్నట్లు పెద్దనగారితో మీ అభిప్రాయం చెప్పడానికి ఆయన ఐదువందల యేండ్లు క్రిందటివాడు. (తనలో) వీళ్ళ సాహిత్యజ్ఞానం పాడుగాను. (ప్రకాశంగా) అయితే మీ పండితులనే చదవమనండి ఇంతకన్న మంచి పద్యం.

**మా:** ఓ దానికే, అలాగే చదువుతా నీ పద్యాన్ని తలదన్నే పద్యం, నే నాశువుగా ఇప్పుడే అల్లిన పద్యం చదువుతా.

**గంజాయి త్రావి, పలువురు**
**సంజాతలగూడి కల్లు చవిగొన్నావా!**
**కుంజర ముఖుడెట్లు కుడుచు**
**అంజన సుత! వాని తొండ మడ్డమురాదే.**

**రాజు:** అంజన సుత అంటే ఏటి, పండితుల వోరూ!

**మా:** అంజన సుత అంటే కోతని అర్థం మహారాజ. తప్పుడు కూతలు కూస్తున్న ఈ పుండరీకుణ్ణి కోతీ అన్నానన్న మాట.

**రాజు:** భేష్. బాగా అన్నావయ్యా.

**పుం:** (వ్యంగ్యంగా) ఆహా! మీ ఆస్థాన విద్వాంసులు ఎంత గొప్ప పద్యం చెప్పారో. పైగా ఈ పద్యం వారే చేశారట. వినండి మహారాజ. ఇది తెనాలి రామకృష్ణ కవి చాటువుగా చెప్పిన పద్యం. దాన్ని ఇటు అటు మార్చి చెప్పాడీయన. అంతేకాదు తప్పుల తడక. అంజన సుత, అనగూడదు. అంజన స్త్రీ లింగం గనుక, అంజనా సుత అనాలి.

**మా:** మళ్ళీ మొదలుపెట్టాడురా నోదె. అంతేకాదు మహారాజ! ఆ కవి ఎవరో చాటుగా చెప్పిన పద్యం ఈయనకెలా తెలిసిందని అడుగతా వున్న.

**రాజు:** అవును నాకూ ఆ అనుమానమే వచ్చింది. అయినా పుండాకోరూ! మా పండితులవోరిని తప్పు పట్టడం కాదు. నువ్వే మా కవిగారి మీద ఒక పద్యం చెప్పవయ్యా.

www.sirimalle.com

**పుం:** అలాగే మహారాజా. కానీ ఆయన చెప్పిన పద్యం నే చాటుగా విన్నాననడం చేతకానితనం. చాటువంటే అర్థం తెలియదన్న మాట మీ పండితమన్యులకు.

**రాజు:** సరిలేవో ముందు మా కవిని పొగుడుతూ పద్యం చెప్పు.

**పుం:** అలాగే మహారాజ. ఓ మార్జాలరావూ విను.

**అన్నాతి గూడ హరుడవు**
**అన్నాతియు లేకున్న అసుర గురుడవు,**
**నన్నా మార్జాలేశా!**
**కన్నొక్కటి కలదుగాని కౌరవపతివే!**

**రాజు:** దీని బావ మేటి పుండాకోరు శాత్రీ!

**పుం:** మీ మార్జాలాన్ని శివునితోను, శుక్రాచార్యులతోనూ, ధృతరాష్ట్రునితోనూ పోల్చి పొగిడాను మహారాజా!

**రాజు:** బాగుంది. ఇదొక్కటే మంచి పనిచేశావయ్య ఈయాల.

**పుం:** (తనలో తాను అనుకుంటున్నాడు) ఈ రాజూ, వీని పండితుడూ ఇద్దరూ మూర్ఖులే. ఒక్క పిసరంతైనా భాషాజ్ఞానం లేని బడుద్ధాయిలు. వీళ్ళే ఇలా వుంటే ఈ వూరి ప్రజలింకెలా వుంటారో. నేను చదివిన చాటుపద్యం లోని భావం వీళ్ళకు అర్థం కాలేదు. పండితుణ్ణి పొగిడానని సంతోషిస్తున్నారు. నిజానికి నేనన్నది: నీతో నీ భార్య వుంటే, మీ ఇద్దరికీ కలిపి మూడు కళ్ళు శివుని వలె. నీతో నీ పెళ్ళాం లేకపోతే ఒకే కన్నుతో వుంటావు శుక్రాచార్యులవలె. నీకున్న ఒక కన్ను లేకపోతే, ఓ మార్జాలరావూ! నువ్వు కళ్ళులేని ధృతరాష్ట్రుడివి.

**రా:** ఏంటాలోచిస్తున్నావు పుండాకోరూ! ఇంకా మీ కయిత్వాలాపి ఇంకేదైనా మాట్లాడండి.

**పుం:** అలాగే మహారాజ! (అని మార్జాలరావుతో) అయితే కొంచెం వేదాంతం పుచ్చుకుందామా రావు గారూ!

**మా:** నేను ఉదయమే సుష్ఠుగా తిని వచ్చా. ఎప్పుడు పడితే అప్పుడు పుచ్చుకోను. కానీ నువ్వు పుచ్చుకుంటే నేనూ పుచ్చుకుంటా.

**పుం:** వేదాంతం పుచ్చుకుందామా అంటే, వేదాంత చర్చ చేద్దామా అని.

www.sirimalle.com

**మా:** అదేనయ్యా నేనూ అన్నది. పుచ్చుకుందామా. ముందు నువ్వు మొదలుపెట్టు.

**పుం:** అలాగే, చూడు. మాటలు లేకుండా చర్చిద్దాం.

(అని పుండరీక శాస్త్రి తన చేతి చూపుడు వ్రేలు చూపాడు. మార్జాలరావు అది చూచి రెండు వ్రేళ్ళు చూపాడు. దానికి శాస్త్రి మూడు వ్రేళ్ళు చూపాడు. దానికి చిర్రెత్తి, రావు పిడికిలి చూపాడు.)

**పుం:** (తనలో) ఓహో వీడికి కొంత ఆధ్యాత్మతత్వం తెలిసినట్లుందే. ఏలనన, నా సంకేతాలు వీనికి అర్థమైనట్లు తోచుచున్నది.

**జీవులందు నొకడే దేవుడని తెలుప**
**ఒప్పుగా చూపితి నొక్క వ్రేలు. (ఇది అద్వైతం)**
**జీవాత్మ పరమాత్మ చేరియుంద రటంచు**
**రెండు వ్రేళ్ళను చూపె పండితుండు, (ఇది ద్వైతం)**
**బ్రహ్మ, విష్ణు, శివులు బరగ దేవుళ్ళనుచు**
**పొందుగా చూపితి మూడు వ్రేళ్ళు, (ఇది లౌకికం)**
**గుప్పిట్ల కూర్చుండె గుట్టుగా జగమని,**
**పిడికిలి చూపించె పెలుచ నతడు (ఇది వేదాంతం)**
**అటుల నద్వైత మేనును, ద్వైతమతడు,**
**చెలసి నే లౌకికము గూర్చి చెప్పా, నతడు**
**వేత్త కరచేత జగమని విశదపరచి,**
**గూఢ వేదాంత తత్వంబు గుర్తు చేసె.**

నేను ఒక వ్రేలును చూపి జగతిలోని జీవులన్నింట ఒకడే దేవుడు పరమాత్మ వుంటాడని ప్రతిపాదించాను. దానికతను ప్రతీ జీవిలోనూ జీవాత్మ, పరమాత్మ లిద్దరూ వుంటారని రెండు వ్రేళ్ళు చూపాడు. నేనపుడు లౌకికపరంగా చూస్తే, మనలను పాలించే ప్రభువులు బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులను ముగ్గురున్నారని మూడు వ్రేళ్ళు చూపాను కదా. అతనేమీ తక్కువ వాడు కాదు. అన్ని ఎరిగిన ఆధ్యాత్మవిదునకు జగత్తంతా కరతలామలకమై గుట్టుగా వుంటుందని పిడికిలి ముడిచి చూపాడు. సాహిత్య వాసన లేక పోయినా వీనికి వేదాంతంలో పరిజ్ఞానం, సంకేత జ్ఞానం గూడా వున్నట్టుంది.

www.sirimalle.com

**రాజు:** ఏమిటి స్వాములు, ఇద్దరూ వేళ్ళూ చేతులతో మాట్లాడు కొంటున్నారు. నాకేమి సంజవటంలే. మార్జాలం గారు మీరైనా చెప్పండి ఈ మూగ బాసకు అర్థం.

**మా:** మహారాజా! ఈ పుండరీడు దుర్మార్గుడు. నా లాంటి మేధావులను చూస్తే అసూయ. అందుకే, నా కొక్క కన్నే వుందని ఒక వేలు చూపి నన్ను కించపరచాడు. అంత మాత్రాన నేనేమి తక్కువా. అందుకే, నా ఒక్క కన్ను నీ రెండు కళ్ళకు సమానమని రెండు వేళ్ళు చూపా (నవ్వుతూ, భుజాలెగరేస్తూ అన్నాడు). దానికతడు నువ్వూ నేను కలిస్తే మనకు మూడు కళ్ళు కదా అంటూ మూడువేళ్ళు చూపి రాజీకి వచ్చాడు. నేను వెనక్కి తగ్గుతానా, గుద్దుతానంటూ గుప్పిడి చూపా.

**రాజు:** భేష్. మా పండితులవోరినంటే ఊరుకుంటాడేటి? ఇకా మూగభాష కాక, అందరికీ తెలిసేట్టు మాటలతో ఆదించుకోండి.

**పుం:** అలాగే మహారాజా! (అని మా.రావు దెసచూసి) రావుగారూ, నేనొక వేదాంత ప్రతిపాదన చేస్తాను. మీరు దానిని సహేతుకంగా ఖండించండి.

**మా:** ఓ, అలాగే.

**పుం:** అధాతో బ్రహ్మ జిజ్ఞాసః

**మా:** (కోపంతో) ఇంతేనా, అయితే విను. అధోతో గోడ జిజ్ఞాసా, అధోతో బల్ల జిజ్ఞాసా, అధోతో ఇల్లు జిజ్ఞాసా, అధోతో తిండి జిజ్ఞాసా, అధోతో డబ్బు జిజ్ఞాసా....
(అంటూ, ఆపకుండా అర్థంలేని రీతిలో గట్టిగా అరుస్తూ చెప్పుకుంటూ పోతాడు.)

**పుం:** (తనలో) ఈ శుద్ధపశుప్రాయునితో ఇలా వాదించి నెగ్గలేము. వేరే దారి చూడాలి, (అని ఆలోచనలో పడ్డాడు. అపుడు)

**మా:** మహారాజా! ఆ శాస్త్రి ఒకటిచెబుతే, నేను పది చెప్పాను. నేనే గెలిచినట్లుకదా ప్రభూ!

**రాజు:** ఇదుగో పుండాకోరు శాత్రీ, నువ్వోడిపోయావు. ఒప్పేసుకో. కిరికిరిపెడితే వూరుకోనంతే.
**ఓడిపోయినోడ వోడినట్లొప్పుకో**
**లొల్లి పెట్టకుండ మళ్ళి మళ్ళి**

www.sirimalle.com

**లేకపోతే నీకు రెక్కల నిరిపించి,**

**మక్కెలిరగ తంత, డొక్క చీల్చి.**

పు: (ఇవేవీ వినకుండా, తనలో) మంచి ఆలోచన వచ్చింది. (ప్రకాశంగా) ప్రభూ! మహారాజా! నేను మీ పండితులవారి వాదనలకు సమాధానం చెప్పడానికి, ఒక్క దినం గడువు ఇప్పించండి. చిన్న ప్రార్ధన. మీ ఊళ్ళోని ఆంజనేయ స్వామివారి గుడిలో పెట్టుకుందాం రేపు వాదన. నా ఇష్టదైవం హనుమంతుల వారు. అక్కడైతే నాకు కొంత ధైర్యంగా వుంటుంది.

మా: మహారాజా! పాపం నన్ను చూసి బెంబేలెత్తాడీ పరదేశి. ఒక దినమే కదా అడిగాడు. గుడిలో పెట్టమంటున్నాడు వాదన. మనకెక్కడైతే నేమిటి. హనుమంతుడేమైనా నాకు తలతీసి మొలేస్తాడా, అలాగే కానిద్దాం ప్రభూ. రేపు ఊరివారందరి ముందు నేను గెలిచేటట్లు చేస్తా.

రాజు: అలాగే, నీవెక్కడైనా గెల్వడం తప్పదు. ఓ మహామంత్రిగోరూ! సభకు రేపు వూళ్ళో అందరినీ మన ఆంజనేయుని గుడికాడికి వచ్చీమని దండోరా యేయండి.

మ.మం: చిత్తం ప్రభూ!

(సభ ముగిసింది. తెర మూసేస్తారు)

## రెండవ రంగం

(మరునాడు ఆంజనేయుని గుడిలో ఒక విశాలమైన గది)

తెర తీసేటప్పటికి ఎదురుగా హనుమంతుని వేషంలోని నటుడు స్టేజీ వెనుకభాగంలో కర్టన్ ముందు, ఒక అడుగు ఎత్తు చిన్న ప్లాట్ఫారం పై కదలకుండా విగ్రహంలా కూర్చుంటాడు. క్రింద వానికి ముందు కుడిప్రక్క భాగంలో ఒక ఆసనంపై మహారాజు, వారికి ముందుగా కొంత దూరంలో వాద, ప్రతివాదులు, వారికి ముందు మరికొంత దూరంలో రాజోద్యోగులు కూర్చుంటారు. పౌరులు కొందరు స్థలాభావం వల్ల నిలబడి వుంటారు.

రాజు: మనవాళ్ళంతా ఇనుకోండి. ఈ చదువుకున్న సాములు ఆదించుకుంటరు. ఎవరు గెలుస్తరో మనం చూద్దం. (పరదేశి కేసి చూస్తూ) ఇదుగో పుండాకోరు శాత్రీ. మొదలెట్టు. ఇక ఆలస్యం దేనికి.

www.sirimalle.com

**పుం:** (లేచినించుని, నమస్కరిస్తూ) చాలా పొరబాటై పోయింది ప్రభూ! రాత్రి ఆంజనేయ స్వామివారికి పూజచేసి, నేనీదినం గెలవాలని మనసారా ప్రార్థించి పడుకున్నాను. అంతే స్వామివారు కలలో కనపడి నన్ను చెడామడా తిట్టారు. 'నీకేమైనా బుద్ధుందా! మార్జాలరావు తోటా నీకు పందెం. అతని పాండిత్యం ఎక్కడ? నీ పాండిత్యం ఎక్కడ? అంతేగాక ఆయన పుణ్యాత్ముడు. అతడు క్రిందటి జన్మలో చేసిన జపాలు, తపాలు, పూజలు, వ్రతాలు ఎవ్వరూ చేయలేదు. అతనెంత గొప్పవాడో నీవు ఊహించనేలేవు. కనుక రేపుదయం, మరోమాట లేకుండా, నీవు ఓడిపోయినట్లు ఒప్పుకో.' అన్నారండి. నా ఇష్టదైవమైన వాయునందనుడే అలాచేబుతే, నేను వేరే చేసేదేముంది ప్రభూ. నేను, మీ ఆస్థాన విద్వాంసుని ముందు ఓడిపోయానని ఒప్పుకుంటున్నాను.

**రాజు:** అద్గదీ మా మార్జాలం అంటే. సరే ఓడినట్టు వువ్వే ఒప్పుకున్నవ్. మా కవిగోరే గెల్చిన్రు. ఈయనకు బహుమతులివ్వాల.

**ప్రజలు:** మార్జాలరావు కవిగారికి జై. వారు వర్ధిల్లాలి. మా పరమశివ మహారాజు గారికీ జై. (అంటూ జయ జయధ్వానాలు చేస్తారు.)

**రాజు:** పుండాకోరూ! నా సంగదేటన్నా చెప్పినేటి హనుమంతుడుగోరు?

**పుం:** చెప్పకేమి మహారాజ! మీలాటి ఉత్తమమైన రాజు ఈ భూప్రపంచంలో ఉండడన్నారు. అందుకే మార్జాలరావు గార్ని మీకు ఆస్థాన విద్వాంసుడిగా ఇచ్చానన్నారండి. ఆయన్ని మీలా వేరే రాజులు గౌరవించలేరన్నారు. నిజానికి మన రావు గారు మహాత్ముడని హనుమాన్లు వారు చెప్పి, నాకో మంచి రహస్యం గూడా చెప్పారండి.

**రాజు:** ఏంటా రహచికం.

**పుం:** దైవ రహస్యం కదండీ. ఎవ్వరికీ చెప్పగూడదండి.

**రాజు:** ఏయ్ పుండాకోరూ! అదేటో నాకు చెప్పు. లేకపోతే నీ తల తీయిస్తా.

**మా:** శాస్త్రీ. చెప్పెయ్. మేమంతా వింటాం. వృథాగా నీ తల ఎందుకు పోగుట్టుకుంటావు.

www.sirimalle.com

**పుం:** మీరంతా అలా బెదిరిస్తే చెప్పక చస్తానా. చెబుతాను. హనుమంతులవారు నా చెవిలో ఇలా చెప్పారండి. ఒరేయ్ పుండరీకా! విను మార్జాలరావు తలమీద, వంటిమీద వున్న వెంట్రుకలు చాలా మహత్యం కలవిరా. ఎవ్వరైనా, ఒక్క వెంట్రుకైనా తీసి తన తలమీద పెట్టుకుంటే వారికి ఒక నెల లోపుగానే మహదైశ్వర్యం పట్టుతుందిరా. నువ్వు రేపు నెమ్మదిగా దగ్గిరకు వెళ్లి అతని వెంట్రుక నొకదాన్ని పీకి నీ తలమీద వేసుకో. చాలు నీ బ్రతుకే మారిపోతుంది. ఆయన చాలా మొహమాటస్థుడు. వెంట్రుక ఇమ్మని అడుగుతే ఇవ్వడు. నువ్వే పీక్కోవాలి. అపుడు నేను వారిని ఇలా అడిగానండి. నాకేనా, అలా వారి వెంట్రుక పీకి తలమీద వేసుకుంటే ఎవరికైనా ధనం వస్తుందా స్వామీ, అని. వారన్నారు. ఎవరికైనా వస్తుంది. తప్పకుండా, కానీ నీవెవరికీ చెప్పకు. లేకపోతే ఆ రాజుగారితో సహా వూరి వారందరూ ఐశ్వర్యవంతులవరూ. కనుక నీవెవరికీ చెప్పకు. నేనింకా వివరాలు అడుగుదామనుకుంటుండగా ఆంజనేయస్వామి అదృశ్యమయ్యారు.

(అలా అంటూ, శాస్త్రి మార్జాలరావు దగ్గరగా వెళ్లి ఆయన తలవెంట్రుకొకటి పీకి తన తలమీద వేసుకున్నాడు. అది చూసి మహారాజు కూడా ఒక వెంట్రుక పీక్కున్నాడు. అంతే, రాజోద్యోగులూ, ఆ తర్వాత సభలోని వారంతా మార్జాలరావు చుట్టూచేరి తలొక వెంట్రుక పీక్కున్నారు. కొందరు వారికే కాక వారి చుట్టాలకొరకు, స్నేహితుల కొరకు కావలిసిన వెంట్రుకలు పీక్కున్నారు. మార్జాలరావు బాబోయ్ కుర్రో, మొర్రో, అంటూ లేచి పారిపోబోతున్నా విడువక, పట్టుకొని తల వెంట్రుకలు పూర్తైయ్యాక, అతని వంటిమీది వెంట్రుకలు కూడా పీక్కున్నారు. అనతికాలంలోనే అతని తల బోడిగుండై, దాని నుండి, అతని శరీరం నుండి రక్తం చెమరించి కారడం మొదలుపెట్టింది. అతను స్పృహతప్పి పడిపోయాడు. ఆ హడావుడిలో, పుండరీక శాస్త్రి పారిపోయాడు.

అంతసేపూ నిద్రపోతున్న హనుమంత వేషధారికి మెలుకువ వచ్చి లేచి సంగతి తెలిసి, మార్జాల రావు ఒళ్లంతా వెదికి చివరికి ఒక వెంట్రుకని పట్టుకుని పీకి గట్టిగా సభాసదనం అదిరేటట్లు నవ్వడం మొదలుపెట్టాడు.)

**హనుమ వేషధారి:** (గట్టిగా) అహ్హాహ్హా.... అహ్హాహ్హా.... అహ్హాహ్హా.... అహ్హాహ్హా....

ఇదే కాబోలు '**హనుమానందం**' అనుకున్నారు ప్రేక్షకులు.

www.sirimalle.com